# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆరో విడతలో 6 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 58 లోక్ సభ స్థానాలకు రేపు పోలింగ్ జరగనుంది.

- ఓట్ల లెక్కింపు ప్రక్రియకు 1,022 మంది సిబ్బందిని కేటాయించినట్లు విశాఖ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి డాక్టర్ ఏ మల్లిఖార్జున తెలిపారు.

- సామాన్య భక్తులకు త్వరితగతిన శ్రీవారి దర్శనం కల్పించేందుకు జూన్ 30వ తేదీ వరకు శుక్ర, శని, ఆదివారాల్లో బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్లు టీటీడీ వెల్లడించింది.

- పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం 24 గంటల్లో తుపానుగా మారే అవకాశం ఉందని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది.

==========================

సార్వత్రిక ఎన్నికలలో భాగంగా రేపు ఆరో విడత పోలింగ్ జరగనుంది. 6 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 58 స్థానాలకు ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. ఈ విడతలో మొత్తం 889 మంది అభ్యర్థులు పోటీ చేయనున్నారు. ఢిల్లీ, హర్యానా, బీహార్, ఉత్తరప్రదేశ్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, జమ్ముకాశ్మీర్, ఒడిశా రాష్ట్రాల్లోని 58 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. వీటితో పాటు ఒడిశాలోని 42 శాసనసభ స్థానాలకూ రేపు పోలింగ్ జరగనుంది.

==========================

జూన్ 4వ తేదీన విశాఖపట్నం జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు 1,022 మంది సిబ్బందిని కేటాయిస్తూ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ మల్లిఖార్జున తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ మేరకు ఈ రోజు కలెక్టరేట్ లో సంయుక్త కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, తదితర అధికారులతో ఆయన సమావేశమయ్యారు. విశాఖ పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు 997 మంది సిబ్బంది అవసరం కాగా, రిజర్వ్ సిబ్బంది తో కలిపి 1022 మందిని కేటాయించినట్లు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సామాన్య భక్తులకు త్వరితగతిన శ్రీవారి దర్శనం కల్పించేందుకు జూన్ 30వ తేదీ వరకు శుక్ర, శని, ఆదివారాల్లో బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నేపథ్యంలో సిఫార్సు లేఖలను ఆయా రోజుల్లో స్వీకరించడం లేదనే విషయాన్ని గమనించాలని టిటిడి భక్తులకు విజ్ఞప్తి చేసింది. వేసవి సెలవుల కారణంగా ఏర్పడిన భక్తుల రద్దీతో సామాన్య భక్తులకు సర్వదర్శనానికి సుమారుగా 30 నుంచి 40 గంటల సమయం పడుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం 24 గంటల్లో తుపానుగా మారే అవకాశం ఉందని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. ఈ తుపానుకు 'రేమాల్'గా నామకరణం చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇది ఈశాన్య దిశగా కదిలి బంగ్లాదేశ్ వద్ద 27వ తేదీ అర్ధరాత్రి దాటాక తీరం దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒడిశా, బెంగాల్, బంగ్లాదేశ్‌పై తుపాను ప్రభావం ఉంటుందని తెలిపారు. తుపాను ప్రభావం రాష్ట్రంపై ఉండదని, అత్యధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వివరించారు. అలాగే సముద్రం అటుపోట్లకు గురయ్యే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని తూర్పుగోదావరి జిల్లా కలక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె. మాధవీ లత తెలిపారు. ఈరోజు కలెక్టరేట్ లో పాత్రికేయులతో ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు అవుతాయనే విషయాన్ని  రాజకీయ పార్టీలు, పోటీ చేసిన అభ్యర్ధులు గమనించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించినట్లు చెప్పారు. ఎన్నికల పరిశీలకులకు  సహాయకులుగా ఒక సహాయకులు, ఇద్దరు మైక్రో అబ్జర్వర్స్ ను నియమించినట్లు కలెక్టర్ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల ఓట్ల లెక్కింపునకు మూడు రోజుల ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని  విజయనగరం జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఓట్ల  లెక్కింపు ప్రక్రియ నిర్వహణ  ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ లో ఆమె ఈ రోజు సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించి పలు సూచనలు చేశారు. లెండి కళాశాలలో చీపురుపల్లి, గజపతినగరం, రాజాం, నెల్లిమర్ల, ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లు లెక్కింపు జరుగుతుందని, జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయంలో విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందని కలెక్టర్ చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రేపు నిర్వహించే డిప్యూటీ డి.ఇ.ఓ.ల నియామక ఆన్‌లైన్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్ధులు, ఉదయం 8 గంటల 30 నిమిషాలలోపే తమకు నిర్దేశించిన పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని విజయనగరం జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత తెలిపారు. జిల్లాలోని 6 కేంద్రాల్లో ఈ పరీక్ష ఉదయం 9 నుంచి 11 గంటల 30 నిమిషాల వరకు ఆన్ లైన్ ద్వారా జరుగుతుందన్నారు. 8 గంటల 30 నిమిషాల తరవాత వచ్చిన అభ్యర్ధులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని పేర్కొన్నారు. ఈ పరీక్షకు మొత్తంగా 1,470 మంది అభ్యర్ధులు హాజరు అవుతారని అనిత వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ కు రాష్ట్ర కేడర్ ఆఫీసర్ల ఎంపిక కార్యక్రమాన్ని వాయిదా వేయాలని యూపీఎస్సీ చైర్మన్ డాక్టర్ మనోజ్ సోనీకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు లేఖ రాశారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నప్పుడు ఈ ఎంపిక కార్యక్రమం చేపట్టడం సముచితం కాదని లేఖలో పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చే వరకు నియామకాలు జరుపవద్దని, పదోన్నతులు ముఖ్యమంత్రి కార్యాలయంలో వారికి మాత్రమే పరిమితం చేయాలని చంద్ర బాబు నాయుడు కోరారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు దంపతులు ఈ రోజు ఉదయం తిరుమలలో శ్రీవారి అభిషేక సేవలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా టిటిడి అధికారులు సంజయ్ జాజు దంపతులకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వారిని వేదపండితులు ఆశీర్వదించి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు ప్రజలను కోరారు. ఈరోజు పార్వతీపురం మండలం బాలగుడబ గ్రామంలో ఆయన ఆకస్మికంగా పర్యటించి ఫ్రై డే- డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ డ్రై డే పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని వివరించారు. జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్ పై ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. తిరుపతిలోని ఆ పార్టీ కార్యాలయంలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.... జూన్ 4వ తేదీన జరిగే కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగే విధంగా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ ను, పోలీసులను ఆయన కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ పాలిసెట్ -2024 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఏపీ సాంకేతిక విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ లో పొందుపరిచింది. ర్యాంకులు సాధించిన వారికి ఏపీ పాలిసెట్ ఫీజు చెల్లింపు ఈరోజు నుంచి 27వ తేదీ వరకు డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఈనెల 31 నుంచి కళాశాలల ఎంపిక ఉంటుంది. వాటికి సంబంధించిన దరఖాస్తు ఫారం appolycet.nic.inలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ర్యాంక్ సాధించిన వారు ఆన్‌లైన్ ద్వారా ఈ రోజు నుంచి జూన్ 2 మధ్య ప్రాసెసింగ్ ఫీజులను చెల్లించాల్సి ఉంటుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయం పరేడ్ గ్రౌండ్ లో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో "మాట్ ఆపరేషన్"మాక్ డ్రిల్ ను ఈ రోజు నిర్వహించారు. ఆర్మ్ డ్ రిజర్వు, క్విక్ రియాక్షన్ టీమ్స్, శాంతి భద్రతల పోలీసు సిబ్బందితో ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జూన్ 4న ఓట్ల లెక్కింపు నేపద్యంలో భద్రతా సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించాలని సూచించారు.

============================

ఈవీఎంల భద్రతపై ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని ఏలూరు జిల్లా నూజివీడు ఆర్డీఓ, నూజివీడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వై.భవానీశంకరి అధికారులను ఆదేశించారు. ఏలూరు లోని సర్ సి.ఆర్.ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూంలను ఆమె అధికారులతో కలిసి ఈరోజు పరిశీలించారు. మూడంచెల భద్రత కల్పిస్తున్న కేంద్ర పోలీసు బలగాలు, జిల్లా ఆర్మ్ డు పోలీసు, సివిల్ పోలీసు బందోబస్తులను ఆర్డీఓ ఈ సందర్భంగా సమీక్షించారు.

============================

తిరుపతిలోని గోవిందరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈరోజుతో వైభవంగా ముగిశాయి. ఉదయం స్వామి వారికి చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. వేద పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ కపిలతీర్థంలోని పుష్కరిణిలో చక్రస్నాన మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

============================

============================